సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 22 । ఆగస్టు । 2023



కేసీఆర్‌కు భంగపాటు తప్పదు

మాయ మాటలతో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌కు మూడోసారి భంగపాటు తప్పదని మాజీ ఎంపీ పొంగులేటి అన్నారు. 8లో



జనజీవనమే జానపదం

సమాజంలో జానపదాలకు ప్రత్యేక గుర్తింపు, ఆదరణ ఉన్నాయి. నేడు ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. 10లో

గరిష్టం / కనిష్టం 33° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

రామాలయంలో సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో సోమవారం చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం, ప్రత్యేక పూజలు చేశారు. కాగా, రామయ్య మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 9న నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ తెలిపారు. ఇందులో అత్యధిక కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయన పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. రాజీ కాదలచిన పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని సూచించారు. అలాంటి కేసుల వివరాలను స్టేషన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి, మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎ.నీరజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.సుచరిత, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, పీపీ ఆర్.విజయ్‌కుమార్, నాగిరెడ్డి, పీవీడీ లక్ష్మి, ఏపీపీలు విశ్వశాంతి, లావణ్య, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తం, డిప్యూటీ కౌన్సిలర్ నిరంజన్‌రావు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన వనమా



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనను ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం 'గెలిచి..రా పెద్దాయనా' అంటూ శుభాకాంక్షలు తెలిపారని వనమా చెప్పారు.

జూనియర్ కళాశాలల్లో 24న స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 24న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆర్‌సీఓ కె.ప్రత్యూష తెలిపారు. బాలురు, బాలికలకు ఖమ్మం కొత్త బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అన్ని కేటగిరీల బాలురకు వివిధ కోర్సుల్లో 156, బాలికలకు 74 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నిర్ణీత సమయంలో హాజరు కావాలని సూచించారు.

ఎన్‌పీడీసీఎల్ డీఈగా నందయ్య



డీఈ నందయ్య


పాల్వంచ : పాల్వంచ డివిజన్ ఎన్‌పీడీసీఎల్ తొలి డీఈగా పీఎస్‌వీఎస్ నందయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ విజిలెన్స్ విభాగంలో డీఈగా పనిచేస్తున్న ఆయన పాల్వంచకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు కొత్తగూడెం డీఈ శేషాద్రి పాల్వంచ బాధ్యతలు నిర్వహించారు. కాగా నందయ్య ఎస్‌ఈ రమేశ్‌ను కలిసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

సిట్టింగ్‌లకే సీటు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గత వారం రోజులుగా జిల్లా రాజకీయాల్లో షికారు చేస్తున్న పుకార్లకు తెరపడింది. ఏ నియోజకవర్గం నుంచి ఏ అభ్యర్థి బరిలో ఉంటారు.. సిట్టింగులకు సీట్లు ఉంటాయా? కొత్త ముఖాలు తెరపైకి వస్తాయా ? అనే ప్రశ్నలకు భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు సమాధానం ఇచ్చారు. సిట్టింగ్ అభ్యర్థులకే కారు గుర్తుపై పోటీ చేసే అవకాశం ఇచ్చారు.

అభ్యర్థులను ప్రకటించిన బీఆర్‌ఎస్

- భద్రాచలంలో తెల్లం వెంకట్రావుకు మరో చాన్స్
- ఇల్లెందుపై ఆఖరి వరకూ ఉత్కంఠ
- 'గూడెం'లో గడల ఆశలు గల్లంతు
- నలుగురు ఎమ్మెల్యేలకూ 'కారు'పై తొలి అవకాశం



స్పష్టత వచ్చింది..

జిల్లాలో కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వైరా నియోజకవర్గంలోని జూలూరుపాడు మండలం కూడా ఈ జిల్లాలోనే ఉంది. ఈ ఐదింటిలో భద్రాచలం మినహాయిస్తే మిగిలిన నలుగురూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. గత ఏడాది కాలంగా కొత్తగూడెంలో సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ప్రత్యామ్నాయం చూస్తారనే ప్రచారం జోరుగా సాగింది. ఇక గత పది రోజులుగా ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియనాయక్‌కు తిరిగి టికెట్ దక్కే అంశం డోలాయమానంలో పడింది. అయితే ఈ ప్రచారాలు, అపనమ్మకాలకు చెక్ పెడుతూ వీరిద్దరిపై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నమ్మకం ఉంచారు. తొలిజాబితాలో వీరికి చోటు కల్పించారు. ఇక ఎలాంటి ఆటంకాలు లేని అశ్వారావుపేటలో మెచ్చా నాగేశ్వరరావు, పినపాకలో రేగా కాంతారావుకు కూడా తొలిజాబితాలో స్థానం దక్కింది. గత ఎన్నికల్లో భద్రాచలం నుంచి పోటీ చేసి ఓడిపోయిన తెల్లం వెంకట్రావుకే మరోసారి కేసీఆర్ టికెట్ కేటాయించారు. అభ్యర్థుల్లో ఒకరు మున్నూరుకాపు సామాజిక వర్గం వారు కాగా, ముగ్గురు కోయ, ఒక లంబాడా తెగకు చెందిన వారు ఉన్నారు.

చివరి నిమిషం వరకు..

ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధిపై తనదైన ముద్ర వేసిన హరిప్రియ విషయంలో వారం రోజులుగా ప్రతికూల ప్రచారం సాగింది. చివరి నిమిషంలో ఇక్కడ అభ్యర్థి మార్పు ఉంటుందనే పుకార్లు షికార్లు చేశాయి. అసమ్మతి నేతలంతా ఏకమై టికెట్ ఇవ్వొద్దంటూ మీడియా సమావేశం పెట్టి మరీ పార్టీ అధినేత కేసీఆర్‌ను కోరారు. దీంతో టికెట్ విషయంలో ఉన్న సందిగ్ధాన్ని తొలగించుకునేందుకు ఆదివారం ఉదయమే హరిప్రియనాయక్ హైదరాబాద్ వెళ్లారు. తన మద్దతుదారులతో అక్కడే మకాం వేసి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఉదయం 11 గంటల సమయంలో పార్టీ వర్గాల నుంచి సానుకూల వార్తలు వినిపించినా మధ్యాహ్నం 2 గంటల వరకు టికెట్ విషయంలో హరిప్రియ ఉత్కంఠను ఎదుర్కొన్నారు. చివరకు సీఎం కేసీఆర్ విడుదల చేసిన జాబితాలో ఆమె పేరు ఉండడంతో ఉపశమనం పొందారు. వెంటనే పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం తన కూతురు రుద్రభారతితో కలిసి కేసీఆర్ నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు.

'గూడెం'లో సంబరాలు..

రాజకీయంగా కెరీర్ ముగిసిందనే దశ నుంచి తిరిగి బరిలో నిలిచారు కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు. మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు హైకోర్టులో వేసిన కేసుతో వనమా గత జూలైలో అనర్హత వేటు ఎదుర్కొన్నారు. అంతకుముందు ఏడాది కాలంగా వనమాకు టికెట్ దక్కదనే ప్రచారం జరిగింది. దీనికి ప్రతిగా వారం, పది రోజులకు ఓసారి 'కొత్తగూడెం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసేది నేనే' అంటూ వనమా చెప్పుకోవాల్సి వచ్చేది. ఇప్పుడా మాటలను నిజం చేస్తూ మరోసారి కొత్తగూడెం సీటును వనమా దక్కించుకున్నారు. దీంతో ఇక్కడి నుంచి పోటీ చేయాలని ఆశించిన హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు ఆశలు గల్లంతయ్యాయి. జీఎస్సార్ ట్రస్ట్ తరఫున ఏడాదిన్నర కాలంగా గడల ఈ నియోజకవర్గంలో పని చేసుకుంటూ వెళ్తున్నారు. వనమాకు టికెట్ కేటాయించడంతో జలగం వెంకట్రావు రాజకీయ ప్రస్థానం ఏ మలుపు తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా మారింది.

తొలిసారి 'కారు' గుర్తుపై..

జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరంతా రాబోయే ఎన్నికల్లో తొలిసారి కారు గుర్తుపై పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, బానోతు హరిప్రియ హస్తం గుర్తుపై గెలుపొందగా, మెచ్చా నాగేశ్వరరావు సైకిల్ గుర్తుపై గెలిచారు. వీరంతా గులాబీ కండువా కప్పుకోవడంతో తొలిసారి కారు గుర్తుపై పోటీ చేసే అవకాశం కలిగింది. ఇక గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన తెల్లం రెండో ప్రయత్నంలో విజయం సాధించేందుకు సిద్ధం అవుతున్నారు.

కూనంనేని.. నిర్ణయమేమి?

- బీఆర్‌ఎస్‌తో దోస్తీ కట్టిన సీపీఐ జాతీయ నాయకత్వం
- కొత్తగూడెం నుంచి పోటీకి సాంబశివరావు ప్రయత్నాలు
- ప్రజాగర్జన పేరుతో 'గూడెం'లో బలప్రదర్శన
- బీఆర్‌ఎస్ తొలి జాబితాలో కొత్తగూడెం అభ్యర్థి ప్రకటన



కూనంనేని

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ ప్రకటించిన తొలి జాబితా మిత్రపక్షమైన సీపీఐకి మింగుడుపడని విధంగా మారింది. ముఖ్యంగా కొత్తగూడెం నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ ఏకపక్షంగా అభ్యర్థిని ప్రకటించిందనే అభిప్రాయం సీపీఐ కార్యకర్తలు, నేతల్లో నెలకొంది. జాతీయ స్థాయిలో బీజేపీని నిలువరించాలనే లక్ష్యంతో సీపీఐ జాతీయ నాయకత్వం బీఆర్‌ఎస్‌తో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోంది. మునుగోడు ఎన్నికల్లో పోటీ చేయకుండా బీఆర్‌ఎస్‌కు మద్దతు పలికింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని పలుమార్లు జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు ప్రకటించారు. బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటే తమ పార్టీ ఏయే స్థానాలు అడగాలనే అంశంపై ఆరు నెలల క్రితమే ఓ నిర్ణయానికి వచ్చింది. ముఖ్యంగా బెల్లంపల్లి, వైరా, కొత్తగూడెం, హుస్నాబాద్ స్థానాల నుంచి పోటీ చేయాలని అనుకుంది. ఈ అంశంపై కేసీఆర్‌తో చర్చించేందుకు పలుమార్లు ప్రయత్నించినా సాధ్యం కాలేదు.

కూనంనేని ఆసక్తి..

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు కొనసాగుతున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్తగూడెం నుంచి పోటీ చేయాలని ఆయన గత రెండేళ్లుగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగానే రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల్లోనూ ఓటింగ్‌కు పట్టుబట్టారు. కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని పటిష్టం చేసే పనులు కొనసాగిస్తూనే కొత్తగూడెంపై ప్రత్యేక దృష్టి సారించారు. పార్టీ వాయిస్‌ను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మండుటెండలను సైతం లెక్క చేయక జిల్లాలో పాదయాత్ర చేపట్టారు. గత జూన్‌లో లక్ష మందితో కొత్తగూడెంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. తద్వారా నియోజకవర్గంలో పార్టీకి ఉన్న పట్టును ప్రదర్శించే ప్రయత్నం చేశారు. పొత్తుల విషయంలో చర్చలంటూ జరిగితే కొత్తగూడెం ను ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదంటూ ఆయన బాహాటంగా అనేకసార్లు ప్రకటించారు. దీంతో ఇటు కొత్తగూడెంతో పాటు అటు భద్రాచలం స్థానంపై సీపీఎంతో చర్చలు జరిపాక బీఆర్‌ఎస్ తుది నిర్ణయం తీసుకుంటుందని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు భావించాయి.

చర్చల్లేకుండానే ప్రకటన..

కమ్యూనిస్టులతో పొత్తు విషయంపై ఎలాంటి చర్చలు, సంప్రదింపులు లేకుండానే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తొలివిడత జాబితాలో కొత్తగూడెం నుంచి తమ అభ్యర్థిగా వనమా వెంకటేశ్వరరావు పేరు ఖరారు చేశారు. దీంతో బీఆర్‌ఎస్‌తో పొత్తు అంశం డైలమాలో పడింది. మరోవైపు కూనంనేని సాంబశివరావు రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకుంటారనే ఆసక్తి నెలకొంది. పార్టీ జాతీయ నాయకత్వం సూచన మేరకు నడుచుకుంటారా ? లేక తనదైన దూకుడు స్వభావంతో రాబోయే ఎన్నికల్లో పోటీకి సై అంటారా అనే చర్చ కొత్తగూడెంలో జరుగుతోంది.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలం: వర్షాకాలంతో పాటు గోదావరి వరదలు వచ్చిపోయిన తర్వాత సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ గ్రామాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత యూనిట్ అధికారులకు అందించి అర్హతల మేరకు పరిష్కరించాలని సూచించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో వాగులు, చెరువులు నిండుగా ఉన్నాయని, పిల్లలు వాటి వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అర్హులైన ప్రతి గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దర్బార్‌లో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏఓ భీమ్, ఎస్‌ఓ సురేష్ బాబు, హార్టికల్చర్ అధికారి అశోక్‌కుమార్, ఏడీ భాస్కరన్, అధికారులు మునీర్ పాషా, ప్రభాకర్ రావు, ఆదినారాయణ, హరికృష్ణ, దుర్గయ్య, గ్రామపంచాయతీ ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు శిక్షణ



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖరశర్మ

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో 6 నుంచి 9వ తరగతి పిల్లల కోసం రూపొందించిన ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను సమర్థంగా అమలు చేయాలని డీఈఓ సోమశేఖరశర్మ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ పరిధిలోని ఆయా యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మూడు రోజుల పాటు ఇవ్వనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉన్నతి, లక్ష్య కార్యక్రమాల అమలులో ప్రధానోపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఉపాధ్యాయులతో సత్సంబంధాలు కొనసాగిస్తూనే పర్యవేక్షణ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందేలా చూడాలని చెప్పారు. శిక్షణ కార్యక్రమానికి సమన్వయకర్తగా జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ వ్యవహరించగా, రిసోర్స్‌పర్సన్లు రమ, శ్రీనివాసరావు, పద్మలత, శంకర్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖ కో- ఆర్డినేటర్లు అన్నామణి, సతీష్, ఏసీజీఈ మాధరావు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

- జిల్లాలో మొత్తం ఓటర్లు 9,28,983
- పురుషులు 4,54,286, మహిళలు 4,74,663 మంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సోమవారం ప్రకటించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే సెప్టెంబర్ 19వ తేదీ వరకు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 9,28,983 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 4,54,286 మంది, మహిళలు 4,74,663 మంది, ఇతరులు 34, ఎన్నారైలు 42 మంది, సర్వీస్ ఓటర్లు 731 మంది ఉన్నారని వివరించారు. మార్పులు, చేర్పులు, అభ్యంతరాల అనంతరం అక్టోబర్ 4న తుది జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు.

నియోజకవర్గాల వారీగా వివరాలిలా..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పినపాక	93,797	95,884	2	1,89,683
ఇల్లెందు	1,04,272	1,07,253	1	2,11,526
కొత్తగూడెం	1,12,980	1,19,501	21	2,32,502
అశ్వారావుపేట	73,916	77,231	7	1,51,154
భద్రాచలం	69,321	74,794	3	1,44,118
మొత్తం	4,54,286	4,74,663	34	9,28,983

లక్కు దక్కింది.. షాపు చిక్కింది

- ముగిసిన మద్యం టెండర్ల డ్రా
- లాటరీ ద్వారా ప్రకటించిన కలెక్టర్ ప్రియాంక
- వేలాదిగా హాజరైన దరఖాస్తుదారులు



డ్రాలో వచ్చిన నంబర్ చూపిస్తున్న కలెక్టర్

పాల్వంచ : మద్యం టెండర్ల డ్రా ప్రక్రియ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. పాల్వంచ జెన్‌కో కాలనీలో గల భద్రాద్రి ఆడిటోరియంలో సోమవారం మద్యం టెండర్లకు కలెక్టర్ ప్రియాంక ఆల సమక్షంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 88 మద్యం దుకాణాల కోసం ఎక్సైజ్ అధికారులు ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 5,057 దరఖాస్తులు రాగా, కొత్తగూడెం స్టేషన్ పరిధిలో 19 షాపులకు 1,063, పాల్వంచ పరిధిలో 13 షాపులకు 723, అశ్వారావుపేటలో 11 షాపులకు 869, భద్రాచలంలో 16 షాపులకు 1137, మణుగూరు పరిధిలో 15 షాపులకు 623, ఇల్లెందు పరిధిలో 14 షాపులకు 642 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులంతా తరలి రావడంతో ఆడిటోరియం ప్రాంగణంలో కోలాహలం నెలకొంది.

భారీ బందోబస్తు నడుమ..

మద్యం దుకాణాల డ్రాకు దరఖాస్తుదారులు, సిండికేట్, బినామీదారులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండటంతో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆడిటోరియంలోకి దరఖాస్తుదారులను మాత్రమే అనుమతించారు. స్టేషన్ల వారీగా కౌంటర్లు ఏర్పాటు చేసి ఎక్కడి వారు అక్కడే కూర్చుని ఎల్‌ఈడీల ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన డ్రా ప్రక్రియ గంట ఆలస్యంగా మొదలైంది.

లాటరీ తీసి ప్రకటన..

కలెక్టర్ ప్రియాంక అల లాటరీ పద్ధతిలో షాపులను ప్రకటించారు. దరఖాస్తు చేసుకున్న వారికి కేటాయించిన నంబర్లను ఓ బాక్స్‌లో వేసి అందులో నుంచి ఒక్కో నంబర్ తీశారు. షాపు నంబర్ ప్రకటించే ముందు ఆయా షాపునకు దరఖాస్తు చేసుకున్న వారి వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారి కేరింతలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఎక్సైజ్ డీసీ జనార్దన్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

బేరసారాలు షురూ..

మద్యం టెండర్ల డ్రా ద్వారా షాపులు దక్కించుకున్న వారికి కొంత నగదు చెల్లించి, తమ వశం చేసుకునేందుకు కొందరు రంగంలోకి దిగారు. మధ్యవర్తుల ద్వారా బేరసారాలకు తెరలేపారు. ఏజెన్సీ ప్రాంతంలో బినామీ పేర్లతో అత్యధికంగా షాపులకు దరఖాస్తులు సమర్పించగా, వారు షాపులు నడిపే పరిస్థితి లేదు. దీంతో గతంలో షాపులు నిర్వహించిన వారి నుంచి ఎంతో కొంత స్వీకరించి దుకాణాలను వారికే అప్పగించేలా చర్చలు సాగుతున్నాయి.

భారీగా తరలివచ్చిన వ్యాపారులు

పాల్వంచరూరల్: జిల్లాలోని వైన్స్ కేటాయింపునకు సోమవారం డ్రా నిర్వహించగా వ్యాపారులు భారీగా తరలివచ్చారు. దీంతో వారి వాహనాలతో నవభారత్ కర్మాగారం గేటు నుంచి పాత పాల్వంచలోని ఎమ్మెల్యే ఇంటి వరకు రహదారి నిండిపోయింది. కాగా, మహిళల పేరిట టెండర్లు వేయడంతో వారు చంటిబిడ్డలతో సహా రావడం కనిపించింది. ఇక మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు తొలి విడతగా నగదు జమ చేసేందుకు బ్యాంకులు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశాయి. ఈ మేరకు రూ.8.17 కోట్లు జమ చేశారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య వెల్లడించారు. అయితే, కౌంటర్లలో కేవలం నగదు మాత్రమే స్వీకరించి, చెక్కులు, ఆన్‌లైన్ పే నిరాకరించడంతో వ్యాపారులు అవస్థ పడ్డారు.



డ్రా హాల్‌కు వచ్చిన వ్యాపారులు

పెద్దమ్మతల్లి కరుణించింది..

జిల్లా వ్యాప్తంగా చూస్తే మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న వైన్స్‌కు అత్యధికంగా 124 దరఖాస్తులు వచ్చాయి. కొందరు ఒకటి కంటే ఎక్కువగా దరఖాస్తులు సమర్పించారు. అయితే డ్రాలో పినపాక మండలం ఏడూళ్ల బయ్యారానికి చెందిన కుర్స మంగయ్య అనే గిరిజనుడికి ఈ షాపు దక్కగా, అమ్మవారు తనను కరుణించిందని మంగయ్య హర్షం వ్యక్తం చేశాడు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజా ఫిర్యాదులు, ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. ఐడీఓసీలో సోమవారం అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదుల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు నివేదికలు అందజేయాలని చెప్పారు. పరిష్కారానికి అవకాశం లేని వాటిని లిఖితపూర్వకంగా తెలియజేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉండడంతో ప్రజావాణిలో పలుమార్లు వినతులు ఇస్తున్నారని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి పోటెత్తారు..



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం) : ఐడీఓసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై వినతులు అందజేశారు. అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్‌రాజు, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్డీఓ శిరీష, జెడ్పీ సీఈఓ విద్యాలత ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

పోడు పట్టాలు ఇవ్వాలి



దీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్ధంతరంగా నిలిపివేసిన పోడు పట్టాలు ఇవ్వకపోతే ఆమరణ దీక్ష చేస్తామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసాని అయిలయ్య పేర్కొన్నారు. ఉమ్మడి రేగళ్ల పంచాయతీలో గిరిజన రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం రేగళ్ల క్రాస్‌రోడ్డు నుంచి పాదయాత్రగా కలెక్టరేట్ వరకు వెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగళ్లలో సర్వే చేసి 350 పట్టాలు తయారు చేశారని తెలిపారు. మంత్రి హరీష్‌రావు సమక్షంలో జూలై 30న జరిగిన పంపిణీ కార్యక్రమంలో 40 మందికి పట్టాలు పంపిణీ చేశారని, తర్వాత ఇవ్వడం లేదని విమర్శించారు. దుబ్బతండా, దూదియాతండా పంచాయతీల్లో 550 మంది రైతులకు పట్టాలు ఇవ్వాల్సి ఉందని అన్నారు. అనంతరం డీఆర్వో రవీంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అన్నవరపు కనకయ్య, సత్యనారాయణ, ఉప్పనపల్లి నాగేశ్వరరావు, వాంకుడోత్ కోబల్, అమర్‌సింగ్, భూక్య బాలకృష్ణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ డ్రామా పోటీలకు ఎంట్రీలు ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: సదరన్ ఇండియా సైన్స్ డ్రామా పోటీలకు ఎంట్రీలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగుళూరుకు చెందిన విశ్వేశ్వర ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలాజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ది బెనిఫిట్ ఆఫ్ మ్యాన్‌కైండ్, విద్యార్థులు మిల్లెట్స్ – ద సూపర్‌ఫుడ్, ఫుడ్ సెక్యూరిటీ, మోడరన్ టెక్నాలజీ ఇన్ డైలీ లైఫ్, కరెంట్ అడ్వాన్స్ ఇన్ హెల్త్ కేర్, సమాజంలో మూఢ నమ్మకాలపై ప్రదర్శన ఇవ్వాలని పేర్కొన్నారు. డ్రామా ప్రదర్శన నిడివి 30 నిమిషాలు మాత్రమే ఉంటుందని, 10 పది మంది మాత్రమే డ్రామాలో పాల్గొనాలని, తెలుగు, ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రదర్శించవచ్చని వివరించారు. ఉత్తమ ప్రదర్శనను రాష్ట్రస్థాయికి పంపుతారని తెలిపారు. పోటీలు సెప్టెంబర్ రెండో వారంలో జరుగుతాయని, ఇతర వివరాలకు జిల్లా సైన్స్ ఆఫీసర్‌ను 92472 96012 నంబరులో సంప్రదించాలని కోరారు.

డీఆర్వోగా రవీంద్రనాథ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా రెవెన్యూ అధికారిగా రవీంద్రనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఖమ్మం ఆర్డీఓగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో రవీంద్రనాథ్ కొత్తగూడెం ఆర్డీఓగా, ఇన్‌చార్జ్ డీఆర్వోగా విధులు నిర్వర్తించారు. ఇక్కడ డీఆర్వోగా పనిచేస్తున్న అశోక చక్రవర్తి ఇటీవల ఖమ్మం జిల్లా కల్లూరు ఆర్డీఓగా బదిలీ అయిన విషయం విదితమే.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఎస్పీ డాక్టర్ వినీత్



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ వినీత్

కొత్తగూడెంటౌన్: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్ ద్వారా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. షీ టీం ఆవశ్యకత, ఉపయోగంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వర్టికల్స్ వారీగా ప్రతిభ కనబరిచిన పోలీసు ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. భద్రాచలం ఏఎస్పీ పంకజ్ పరితోష్, డీఎస్పీలు అబ్దుల్ రెహామాన్, వెంకటేష్, రమణమూర్తి, మల్లయ్య స్వామి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బూర్గంపాడు: సారపాక గ్రామపంచాయతీలోని బసప్పక్యాంపులో ఓ వివాహిత ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. బసప్పక్యాంపునకు చెందిన కట్ట దివ్య(25) సోమవారం రాత్రి తన ఇంట్లోనే ఉరివేసుకుంది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె అప్పటికే మృతిచెందింది. మృతురాలికి భర్త ఆనంద్‌కుమార్ ఉన్నాడు. మృతిపై పోలీసులు విచారణ చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

శతాధిక వృద్ధుడు మృతి

చండ్రుగొండ : మండలకేంద్రం చండ్రుగొండకు చెందిన దడిగెల వెంకటి (102) సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, నలుగురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు సందర్శించి సంతాపం తెలిపారు.

మళ్లీ పాత కాపులే..

బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సోమవారం అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించారు. జిల్లాలోని ఐదు సెగ్మెంట్లలో సిట్టింగ్ అభ్యర్థులకే టికెట్లు ఖరారు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. పలుచోట్ల పార్టీ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ప్రొఫైల్, మినీ ఇంటర్వ్యూలు.. – సాక్షి నెట్‌వర్క్

పినపాక

పేరు: రేగా కాంతారావు



తల్లిదండ్రులు : బొర్రయ్య,నర్సమ్మ
పుట్టినతేదీ : 09.04.1977
కులం: ఎస్టీ(కోయ)
భార్య : సుధారాణి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు
పిల్లలు : నవదీప్ దొర, హ్యోమచంద్ర దొర
విద్యార్హతలు : యూజీడీ పీఈడీ, ఎంఏ పొలిటికల్ సైన్స్

నేపథ్యం..
పినపాక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2009, 2018లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి కేసీఆర్ ప్రభుత్వంలో విప్‌గా పనిచేస్తున్నారు. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఖరారైంది.

ప్ర: మూడోసారి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు. ఎలా ఫీలవుతున్నారు.?
జ: మూడోసారి పినపాక అసెంబ్లీకి పోటీ చేస్తున్నాను. పోటీ చేసిన రెండుసార్లు విజయం సాధించాను.ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులు, పినపాక నియోజకవర్గ ప్రజల దీవెనలతో ఈసారి కూడా విజయం సాధిస్తాను.

ప్ర: ఈసారి ఎన్నికల్లో ఏ నినాదంతో ముందుకెళ్తారు.?
జ: అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా. అదే నినాదంతోనే ప్రజల్లోకి వెళ్తాం. సీఎం కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు ఇచ్చారు. నియోజకవర్గాన్ని వ్యవసాయపరంగా, పారిశ్రామికంగా జిల్లాలో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తాను.

ప్ర: ఎన్నికల ప్రచారం ఎప్పుడు ప్రారంభిస్తారు.?
జ: శ్రావణమాసంలోనే ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తాం. ఇప్పటికే అన్ని గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పనులతో పార్టీ శ్రేణులు ప్రచారం సాగిస్తున్నాయి.

ప్ర: పార్టీలో అసమ్మతిని ఎలా ఎదుర్కొంటారు.?
జ: పినపాక నియోజవర్గంలో బీఆర్‌ఎస్‌లో అసమ్మతి లేదు. పార్టీ కోసం పనిచేయని వారు వేరే పార్టీలలో చేరిపోయారు. ఇప్పుడు పార్టీ అంతా ఏకతాటిపై నడుస్తోంది. గ్రామస్థాయిలో ఎవరైనా అసంతృప్తులు ఉంటే మాట్లాడి అందరిని కలుపుకుపోతాం.

ప్ర: రాబోయే ఎన్నికల్లో మీ గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయి?
జ: పినపాక నియోజకవర్గంలో నా గెలుపు నల్లేరుపై నడకే. గడిచిన ఐదేళ్లలో నేను చేసిన అభివృద్ధి పనులే నన్ను గెలిపిస్తాయి. మౌలికవసతుల కల్పన, రహదారులు, సాగునీటి ప్రాజెక్టలకు వందల కోట్ల నిధులు ఖర్చుచేశాం. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూశాం. ప్రత్యర్థి పార్టీలకు డిపాజిట్లు రాకుండా చేయటమే మా టార్గెట్.

– బూర్గంపాడు

భద్రాచలం

పేరు : తెల్లం వెంకట్రావు



స్వస్థలం: దుమ్ముగూడెం మండలం సూరారం గ్రామం
తల్లిదండ్రులు: బాపనయ్య,జానకమ్మ
పుట్టిన తేది: జనవరి 25, 1967
వృత్తి: వైద్యుడు
విద్యార్హత: ఎంబీబీఎస్(సిద్దార్థ మెడికల్ కళాశాల, విజయవాడ)
ఎంఎస్: (ఉస్మానియా మెడికల్ కళాశాల, హైదరాబాద్)
భార్య: ప్రవీణ,
పిల్లలు: ఇద్దరు కుమార్తెలు

నేపథ్యం
భద్రాచలం నియోజకవర్గంలో గతంలో ప్రభుత్వ వైద్యుడిగా పనిచేశారు. అనంతరం ఉద్యోగానికి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరిక ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. తొలుత 2014లో మహబూబాబాద్ ఎంపీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓటమి పొందారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరి 2018లో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పొందారు. ప్రైవేట్ ఆస్పత్రిని స్థాపించి వైద్య సేవలను అందిస్తున్నారు. భద్రాచలం అసెంబ్లీ నుంచి మరోసారి పోటీకి టికెట్ ఖరారైంది.

ప్ర: మరోసారి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు. ఎలా ఫీలవుతున్నారు?
జ: 2018లోనే గెలవాల్సి ఉంది. కొద్దిలో విజయం తప్పింది. ఇప్పుడు మూడోసారి ఎన్నికల్లో పోటీచేయబోతున్నాను. సీఎం కేసీఆర్ సమక్షంలో మళ్లీ నాకు టికెట్ ఖరారు కావడం చాలా సంతోషం.

ప్ర: ఏ నినాదంతో ఎన్నికలకు వెళ్లనున్నారు?
జ: నియోజకవర్గ అభివృద్దే ప్రధానం. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. యాదాద్రి తరహాలో భద్రాద్రి అభివృద్ధి కేవలం కేసీఆర్‌తోనే సాధ్యం. అవే నినాదాలతో ప్రజల్లోకి వెళ్తాం. భద్రాచలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం.

ప్ర: ఎన్నికల ప్రచారం ఎప్పుడు ప్రారంభిస్తారు?
జ: ప్రజల్లో నిరంతరం ఉండాలన్నది మా అధినాయకుడి ఆదేశం. ఈ రోజు నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించినట్లే లెక్క.

ప్ర: పార్టీలో అసమ్మతిని ఎలా ఎదుర్కొంటారు?
జ: పార్టీలో అసమ్మతి సహజంగా ఉంటుంది. అందరం కలిసి కట్టుగా పనిచేయాల్సిందే. వారందరినీ కలుపుకకుని పోతా. పార్టీకి విధేయులుగా పనిచేసి గెలిచి కేసీఆర్‌కు భద్రాచలాన్ని బహుమతిగా అందిస్తాం.

ప్ర: రాబోయే ఎన్నికల్లో మీ గెలుపు అవకాశాలు ఎలా ఉన్నాయి?
జ: బీఆర్‌ఎస్ పార్టీ ఇమేజే గెలిపిస్తుంది. గతంకంటే పార్టీకి ఓటింగ్ బాగా పెరిగింది. అందరి సహాయ సహకారంతో ఈసారి గెలుస్తాం. పోడు భూములకు హక్కు పత్రాలు, ఇతర సంక్షేమ పథకాలు వరంగా మారాయి.

– భద్రాచలం

అశ్వారావుపేట

పేరు: మెచ్చా నాగేశ్వరరావు



భార్య: శ్యామల
తల్లిదండ్రులు: రాములు, ఆదెమ్మ
జననం: జూన్ 16, 1965, తాటి సుబ్బన్నగూడెం గ్రామం, దమ్మపేట మండలం

నేపథ్యం
దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా 1995లో గెలుపొందారు. 2001లో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2018 ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఖరారైంది.

ప్ర: మరోసారి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు.? ఎలా ఫీలవుతున్నారు.?
జ: చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ నాపై నమ్మకంతో అసెంబ్లీకి పోటీ చేసేందుకు అవకాశం కల్పించడం ఆనందం కలిగించింది.

ప్ర: ఈ సారి ఎన్నికల్లో ఏ నినాదంతో ముందుకెళ్తారు.?
జ: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చాను. మిగిలిన వాటిని కూడా త్వరలోనే నెరవేరుస్తాను. ఇంకా నేను చెప్పని వాటిని కూడా చేసి చూపించాను. నా హయాంలో చేసిన అభివృద్ధి, హామీల అమలు, సంక్షేమ నినాదంతో వెళ్తాను.

ప్ర: ఎన్నికల ప్రచారం ఎప్పుడు ప్రారంభిస్తారు.?
జ: ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు వెళ్తున్నాను. ఎన్నికల ప్రచారానికి ఇంకా సమయం ఉంది. సీఎం కేసీఆర్ ఆదేశాలతో ప్రచారాన్ని ప్రారంభిస్తాను.

ప్ర: అసమ్మతిని ఎలా ఎదుర్కొంటారు?
జ: ప్రతి పార్టీలో ఉండే అసమ్మతి, మా పార్టీలో కూడా కొద్ది మేర ఉంది. అలాంటి వారితో కుర్చొని, మాట్లాడి పరిష్కరించుకుంటాం.

ప్ర: మీ గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయి..?
జ: సీఎం కేసీఆర్ పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తోడు నా పనితీరుపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారు. కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలు నాకే అనుకూలంగా ఉన్నాయి.

– అశ్వారావుపేటరూరల్

ఇల్లెందు

పేరు : రాంబాయి అలియాస్ హరిప్రియ బానోతు



భర్త : హరిసింగ్ నాయక్
గ్రామం : దాసుతండా
మండలం : టేకులపల్లి
జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం
వయసు : 38 సంవత్సరాలు
పిల్లలు : ఏడాది లోపు పాప (రుద్రభారతీ ప్రియ)
విద్యార్హత : ఎంటెక్(సీఎస్ఈ) జేఎన్‌టీయూ

రాజకీయ నేపథ్యం
2014లో టీడీపీ నుంచి పోటీ చేసి 33,531ఓట్లు పొంది ఓటమి పాలయ్యారు. 2017లో కాంగ్రెస్‌లో చేరి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, ఛత్తీసగఢ్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి 2,907 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. మొత్తం 70,259 ఓట్లు సాధించారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఖరారైంది.

ప్ర: మరోసారి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు? ఏ నినాదంతో ముందుకెళ్తారు?
జ: చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పోటీ చేసే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నాను. నాలుగు ఏళ్లుగా ఇల్లెందు నియోజకవర్గంలో మునుపెన్నడూ జరగనంత అభివృద్ధి చేశాం. అదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తా. రానున్న కాలంలో అంతకు రెట్టింపు అభివృద్ధికి పాటుపడుతా. అభివృద్ధి మంత్రమే ఎన్నికల నినాదం.

ప్ర: ఎన్నికల ప్రచారం ఎప్పుడు ప్రారంభిస్తారు?
జ: ఎన్నికల ప్రచారం సాగుతూనే ఉంది. ప్రత్యేకంగా ప్రారంభించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే రథం కూడా వచ్చింది. పూజా కార్యక్రమం కూడా జరిగింది. ప్రజల్లో నిరంతరం ఉన్నామంటే ప్రచారంలో ఉన్నట్లే.

ప్ర: పార్టీలో అసమ్మతిని ఎలా అధిగమిస్తారు?
జ: అందరినీ కలుపుకుని వెళ్తా. పార్టీ అంటే ఒక్కరిది కాదు. అందరితో చర్చించి అంతరాలు తొలగిపోయేలా సమాలోచనలు చేసి ఒక్కటిగా ముందుకు సాగుతా.

ప్ర: మీ గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయి?
జ: ఈసారి ఎన్నికల్లో సునాయాసంగా విజయం సాధిస్తాను. నేను చేసిన అభివృద్ధే గెలిపిస్తుంది. సీఎం కేసీఆర్ ఆశీర్వాదం తోపాటు నియోజకవర్గ ప్రజలు అభిమానులు, నేతల కృషితో గెలుపు ఖాయం.

– ఇల్లెందు

కొత్తగూడెం

పేరు: వనమా వెంకటేశ్వరరావు



సతీమణి: పద్మావతి
ఊరు: పాత పాల్వంచ
కులం: మున్నూరుకాపు
పుట్టిన తేదీ: 1, నవంబర్, 1945
విద్యార్హత: పీయూసీ
పిల్లలు: రాఘవేందర్ రావు, రామకృష్ణ, విజయలక్ష్మి, అరుణ

రాజకీయ నేపథ్యం
తొలుత సర్పంచ్‌గా పనిచేశారు. 1989, 1999, 2004, 2018లలో నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైఎస్ హయాంలో వైద్య విధాన పరిషత్ మంత్రిగా పనిచేశారు. 2001 నుంచి 13 ఏళ్లపాటు ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో గెలిచాక కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. 2023లో బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఖరారైంది.

– సూపర్‌బజార్(కొత్తగూడెం)

ప్ర: మరోసారి అసెంబ్లీకి పోటీ చేయబోతున్నారు? ఎలా ఫీలవుతున్నారు.
జ: ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడం ఈసారితో ఏడుసార్లు. సీఎం కేసీఆర్ నా పేరు ప్రకటించడం పట్ల చాలా సంతోషంగా ఉంది.

ప్ర: ఈసారి ఎన్నికల్లో స్థానికంగా ఏ నినాదంతో ముందుకెళ్తారు?
జ: నియోజకవర్గంలోనే పుట్టి పెరిగాను, సర్పంచ్ నుంచి మంత్రి వరకు పని చేసిన అనుభవం ఉంది. కొత్తగూడేన్ని ఆదర్శంగా నిలుపుతాను. స్థానికుడిని ఆదరించాలి, అభివృద్ధే ధ్యేయం అనే నినాదంతో ముందుకు వెళ్తాను. కొత్తగూడెం, పాల్వంచలను జంట నగరాలుగా అభివృద్ధి చేస్తా.

ప్ర: ఎన్నికల ప్రచారం ఎప్పుడు ప్రారంభిస్తారు.?
జ: ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నాను కొత్తగూడెం రాగానే మంజూరైన కొన్ని పనులకు మంత్రులను ఆహ్వానించి శంకుస్థాపన చేస్తాం. అనంతరం ప్రచారం ప్రారంభిస్తాం. ప్రజలకు రోజు అందుబాటులో ఉంటా కాబట్టి నేను చేసేది రోజు ప్రచారమే.

ప్ర: పార్టీలో అసమ్మతిని ఎలా ఎదుర్కొంటారు.
జ: బీఆర్‌ఎస్ పార్టీలో అసలు అసమ్మతి లేదు. అందరూ వనమా జై అని పలుకుతుంటే ఇంకా ఎక్కడ ఉంది అసమ్మతి.

ప్ర: రాబోయే ఎన్నికల్లో మీ గెలుపు అవకాశాలు ఎలా ఉంటాయి?
జ: రాబోయే ఎన్నికల్లో మళ్లీ నేను గెలుస్తాను. ప్రస్తుతం చేసిన, చేయబోతున్న పనులు, పథకాలే గెలిపిస్తాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలు పనికి వస్తాయి. తప్పని సరిగా విజయం సాధిస్తాను.

– కొత్తగూడెంఅర్బన్

కేసీఆర్‌కు భంగపాటు తప్పదు

- రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తాం
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి

చుంచుపల్లి: ప్రజలకు మాయ మాటలు చెప్పి రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్‌కు మూడోసారి ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం చుంచుపల్లి విద్యానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన సమయంలో సోనియాగాంధీని దేవత అంటూ పొగిడి కాళ్లు మొక్కిన సీఎం కేసీఆర్, తెలంగాణ ఇచ్చిన అలాంటి పార్టీపై నేడు అవాకులు చెవాకులు పేలుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు.

ఎమ్మెల్యేలు పర్సంటేజీలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రే చెప్పారు..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వ పథకాల్లో పర్సంటేజీలు తీసుకుంటున్నారని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారని, ఇది సిగ్గుచేటని అన్నారు. కేసీఆర్ కూతురు ఈడీ కేసుల్లో ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోందే తప్ప చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని, మీరు కొట్టినట్లు నటించండి, మేము ఏడ్చినట్లు నటిస్తామనే చందంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పేదల పక్షాన నిలబడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన అదే నిరూపించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సొంత జాగా ఉండి ఇల్లు కట్టుకునే ప్రతి పేదవాడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని, కేవలం రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను సరఫరా చేస్తామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. కేసీఆర్ మాయమాటలతో గిరిజనులను సైతం మోసం చేశారని, 13 లక్షల ఎకరాలకు పోడు పట్టాలిస్తానని చెప్పి కేవలం 4.25 లక్షల ఎకరాలకే పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు.

కొత్తగూడెంలో దందాలకు త్వరలోనే విముక్తి..

కొత్తగూడెంలో ప్రస్తుతం జరుగుతున్న చందాల దందాలు, బెదిరింపులకు త్వరలోనే విముక్తి కలుగుతుందని పొంగులేటి అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎలాంటి దందాలు ఉండవని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో వచ్చే మాయల ఫకీరుగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అధికార పార్టీ నాయకుల వేధింపులు, కేసులకు భయపడవద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని 300 మంది నాయకులు, కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు నాగ సీతారాములు, ఊకంటి గోపాలరావు, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, యర్రం శెట్టి ముత్తయ్య, చింతలపూడి రాజశేఖర్, రామనాథం, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

బీజేపీ ఎమ్మెల్సీ ప్రతాప్ జయసింహ



కర్ణాటక ఎమ్మెల్సీతో బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్/దుమ్ముగూడెం: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, అందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని కర్ణాటకకు చెందిన బీజేపీ ఎమ్మెల్సీ ప్రతాప్ జయసింహ అన్నారు. సోమవారం భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలతోపాటు నిధులు ప్రకటించి విడుదల చేయకుండా భద్రాద్రి రామయ్యను కూడా మోసం చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడప గడపకూ తీసుకెళ్లాలని సూచించారు. తొలుత ప్రతాప్ శ్రీసీతారామచంద్ర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, ఎర్రం రాజు బెహరా, క్రాంతికుమార్, రామ్మోహన్‌రావు, నరసింహారావు, వెంకన్న, చక్రవర్తి, తెల్లం శేఖర్, చెరుకూరి సతీష్ కుమార్, గోలకోటి త్రినాథరావు, ఎర్రం రాజు, కణితి లక్ష్మి, నిడదవోలు నాగబాబు, కుర్సం వసంతరావు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

భద్రాచలంటౌన్: పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన 6 క్వింటాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లాయిస్ అధికారులు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. భద్రాచలం డీటీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. బూర్గంపాడు మండలం నుంచి రేషన్ బియ్యం ఆటోలో తీసుకొచ్చి రాజీవ్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచి వేరే ప్రాంతాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. తనిఖీ చేయగా ఇంటి ముందు ఆటోలో 3 క్వింటాలు, ఇంట్లో 3 క్వింటాల రేషన్ బియ్యం గుర్తించారు. బియ్యం స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేశారు. అక్రమంగా బియ్యం నిల్వ చేసిన ప్రవీణ్, గౌస్ పాషాలపై పోలీసు కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు.

జూలూరుపాడులో ఐదు క్వింటాళ్లు..

జూలూరుపాడు: కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు ఆటోలో అక్రమంగా సుమారు 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా సోమవారం పోలీసులు పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేశారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న తల్లాడ మండలం నరసింహారావుపేటకు చెందిన శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.పురుషోత్తం తెలిపారు.

పురుగుల మందు తాగి బలవన్మరణం



నాగేశ్వరరావు (ఫైల్)

సుజాతనగర్: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సీతంపేట బంజర గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గుగ్లోత్ కోటేశ్వరరావు(38) సీసీ రోడ్లు, డ్రెయిన్లు తదితర పనులను ఒప్పుకొని చేస్తుంటాడు. ఈ క్రమంలో మర్రితండా గ్రామంలో పనులు జరుగుతుండగా, అక్కడి నుంచి ఇంటికి వచ్చి పురుగుల మందు తాగాడు. పొలం పనులు ముగించుకుని కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి మంచంలో విగత జీవిగా కన్పించాడు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. కాగా మృతికి కారణాలు తెలియరాలేదు.

అదుపు తప్పిన ద్విచక్రవాహనం

ప్రమాదంలో యువకుడు మృతి

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఓసీ మూలమలుపు సోలార్ ప్లాంట్ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. ఇల్లెందు దో నంబర్ బస్తీకి చెందిన వట్టికోట రాహుల్(20) ద్విచక్రవాహనంపై కారేపల్లిలోని తమ బంధువుల ఇంటి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ ఓసీ మూలమలుపు సోలార్ ప్లాంట్ వద్ద ఆయన ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడ్డాడు. ఈ ఘటనలో రాహుల్ తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని కారేపల్లి పోలీసులు తెలిపారు.

చేప అరుదు.. తీరు బెదురు



జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని కాల్వలో అరుదైన చేప లభించింది. ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థి సాయిచరణ్‌కు సోమవారం చూడటానికి వింతగా.. రాయిలా గట్టిగా ఉన్న చేప కనిపించడంతో స్థానిక డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు సదాశివయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా సదాశివయ్య మాట్లాడుతూ 'ఇది హైపోస్టోమస్ ప్లెకోస్టోమస్ అనే విదేశీ చేప. సాధారణంగా దీన్ని సక్కర్ మౌత్ క్యాట్ ఫిష్ అంటారు. ఇది దక్షిణ అమెరికా ప్రాంతానికి చెందింది. ఈ చేపలు నీటిలోని నాచు, నీటి మొక్కలతో పాటు నత్తలు, చిన్నచిన్న చేపలు ఇతర నీటి జీవులను తింటాయి. ఇవి ఒళ్లంతా చిన్నపాటి ముళ్లను కలిగి గట్టిగా ఉంటాయి. వీటి నోరు పూర్తిగా కింద భాగాన ఉంటూ నాచును పీల్చడానికి ఉపయోగపడుతుంది. ఇవి దాదాపు అరమీటరు పొడవు పెరిగే అవకాశం ఉంది. అయితే ఈ చేపను ఆహారంగా తీసుకోరాదు. అక్వేరియంలో నాచును శుభ్రపర్చడానికి మాత్రమే వినియోగించాలి' అని సదాశివయ్య వివరించారు.

60, 70 శాతం ఫీజు తీసుకోండి

ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజుపై హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్ కాలేజీల ఫీజు వసూళ్లకు సంబంధించి హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. మొత్తం ఫీజులో ఏ–కేటగిరీ విద్యార్థుల నుంచి 60 శాతం, బీ–కేటగిరీ విద్యార్థుల నుంచి 70 శాతమే తీసుకోవాలని కాలేజీలను ఆదేశించింది. మిగతా ఫీజు చెల్లింపు ఎలా అన్నది తుది ఉత్తర్వుల్లో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుతూ ప్రభుత్వం జీవో నంబర్ 107ను తీసుకొచ్చిందని, నిబంధనలకు విరుద్ధంగా తీసుకొచ్చిన దీన్ని రద్దు చేయాలని కోరుతూ డాక్టర్ వెంకటదుర్గ అశోక్‌తో పాటు మరో 221 మంది పీజీ విద్యార్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ చిల్లకూర్ సుమలత విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది సామ సందీప్‌రెడ్డి వాదనలు వినిపించారు. కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా రెండింటిలోనూ 179 శాతం నుంచి 296 శాతం వరకు ఫీజులు పెంచడం సమర్థనీయం కాదని, చట్టప్రకారం చదువుకునే హక్కును హరించినట్లే అవుతుందన్నారు. ఇప్పటికే ఈ ఫీజులకు సంబంధించిన పిటిషన్ ఇదే హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రస్తుతానికి విద్యార్థుల నుంచి 60 శాతం, 70 శాతం మాత్రమే ఫీజు తీసుకోవాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగాతెలంగాణ నేతలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా రాష్ట్రానికి చెందిన పలువురు ముఖ్య నేతలను నియమిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన వారిలో మాజీ మంత్రులు మర్రి శశిధర్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌తోపాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలున్నారు. మాజీ ఎంపీలు డి.రవీంద్రనాయక్, బూర నర్సయ్యగౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రమేశ్ రాథోడ్, చాడ సురేశ్‌రెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యేలు టి.రాజేశ్వర్‌రావు, వి.జయపాల్, వన్నాల శ్రీరాములు, జి.రామకృష్ణారెడ్డి, బొడిగె శోభ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, జయసుధ, ఆకుల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు.

ధరణితో పేదలను దగా చేశారు

- బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి ధ్వజం
- మాస్టర్‌ప్లాన్ పేరిట భూములు కొల్లగొట్టే యత్నం
- నిర్మల్‌లో ఏలేటికి పరామర్శ.. దీక్ష విరమణ

నిర్మల్: తెలంగాణ ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చారని, సీఎంతో పాటు మంత్రి కేటీఆర్ మార్కెటింగ్ బ్రోకర్లుగా వ్యవహరిస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ధరణి పోర్టల్ తెచ్చి రైతులను దగా చేశారని ధ్వజమెత్తారు. తాజాగా మాస్టర్ ప్లాన్ పేరుతో రైతుల భూములు కొల్లగొట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. నిర్మల్ మాస్టర్ ప్లాన్ మార్చాలని జిల్లా కేంద్రంలో ఆరు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని కిషన్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మహేశ్వర్‌రెడ్డి, జిల్లా యువత, రైతులు వారం రోజుల పాటు చేసిన పోరాటం అభినందనీయమని అన్నారు. వీరి కృషి కారణంగానే రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తగ్గిందని చెప్పారు.



నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తూ..

పోరాటంతో దిగివచ్చిన మున్సిపాలిటీ

ఆరురోజులుగా దీక్ష చేస్తున్న ఏలేటిని సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీసులు బలవంతంగా ఆయన ఇంటి నుంచి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సెలైన్లు పెట్టి వైద్యచికిత్స చేయించారు. అయినా ఆయన నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ క్రమంలో నిర్మల్ వెళ్లిన కిషన్‌రెడ్డి ఏలేటిని పరామర్శించారు. తమ పోరాటానికి నిర్మల్ మున్సిపాలిటీ దిగివచ్చి తీర్మానం చేసిందని తెలిపారు. నిమ్మరసం ఇచ్చి ఆమరణ దీక్ష విరమింపజేశారు. రెండురోజుల పాటు నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల సందర్భంగా పోలీసులు జరిపిన లాఠీచార్జిలో గాయపడిన పార్టీ కార్యకర్తలను కూడా కిషన్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఏలేటి నివాసంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

భూవ్యాపారం దారుణం..

నిర్మల్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూమిని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కుటుంబసభ్యుల పేరిట మార్చుకుని భూవ్యాపారం చేయడం దారుణమని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రమంతా ఇదే సమస్య ఉందని, అధికార పార్టీ నాయకులు అక్రమ భూదందాలు చేస్తున్నారని ఆరోపించారు. ధరణి పోర్టల్ తో సీఎం పేదలను దగా చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు భూములను తమ ఖాతాలో వేసుకుంటూ మాఫియాలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ధరణి కారణంగా అనేకమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటూ, ఇవన్నీ కేసీఆర్ కుటుంబం చేసిన హత్యలేనని ఆరోపించారు. నిర్మల్‌లో కూడా 260 ఎకరాల భూమిని మంత్రి కుటుంబ సభ్యులకు ప్రభు త్వం ఎందుకు అమ్మేసిందో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. నయా నిజాం కేసీఆర్‌పై సమష్టిగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

హైకోర్టు విచారణలు ప్రత్యక్ష ప్రసారం

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన ప్రత్యక్ష ప్రసార సేవలను ప్రారంభించి.. న్యాయవాదులకు, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత 10.30గ. నుంచి కోర్టుల విచారణలు ప్రత్యక్ష ప్రసారమ య్యా యి. ప్రత్యక్ష ప్రసారాలతో న్యాయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువవుతుందని సీజే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

లింక్ క్లిక్ చేస్తే...

హైకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించిన లింక్ ఇచ్చారు. ఈ లింక్ ద్వారా కోర్టును ఎంపిక చేసుకుని ప్రత్యక్ష ప్రసారాలు వీక్షించవచ్చు. ఫస్ట్ కోర్టు విచారణ ప్రత్యక్ష ప్రసారం ఇప్పటికే అందుబాటులో ఉంది. కరోనా సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు కొనసాగగా, ఆ తర్వాత హైబ్రిడ్ విధానంలో విచారణ చేపడుతున్నారు. 2020లో ప్రత్యక్ష ప్రసారాలను అందుబాటులోకి తెచ్చిన గుజరాత్ హైకోర్టు, ఆ తర్వాత యూట్యూబ్ చానెల్‌ను ప్రారంభించింది. కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, కోల్‌కతా, ఛత్తీస్‌గఢ్ హైకోర్టులు కూడా ప్రత్యక్ష ప్రసారాలు, యూట్యూబ్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ప్రత్యక్ష ప్రసారాలతో పారదర్శకత పెరుగుతుందని న్యాయ నిపుణులు పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇదిలాఉండగా, హైకోర్టు, కిందికోర్టుల విచారణలను ప్రత్యక్ష ప్రసారం చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతూ 2022లో హై కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) కూడా దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన నాటి సీజే ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారాలకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ప్రసారాలకు కావాల్సిన మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది.

లోక్‌సభ ఎన్నికల కోసమేనా..?

కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీపై చర్చ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈసారి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌తో పాటు, కామారెడ్డిని కూడా ఎంచుకోవడం ఉమ్మడి మెదక్ జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. 2014, 2018 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి ఘన విజయం సాధించిన కేసీఆర్..తన హయాంలో గజ్వేల్ రూపురేఖలు మార్చేశారు. అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దారు. తాజాగా ఆయన కామారెడ్డి నుంచి కూడా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంతో ఆ నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే రానున్న పార్లమెంట్ ఎన్నికలు దృష్టిలో ఉంచుకునే కేసీఆర్ కామారెడ్డిని కూడా ఎంచుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కామారెడ్డి అసెంబ్లీ స్థానం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉంటుంది. కామారెడ్డిలో పోటీ చేయడం ద్వారా జహీరాబాద్‌తో పాటు, నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు సునాయాసంగా అవుతుందనే ఉద్దేశంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకుని ఉండి ఉంటారనే చర్చ జరుగుతోంది.



5కిలోల బంగారాన్ని, ఈఓ గీతారెడ్డికి జీయర్‌స్వామి సమక్షంలో అందజేస్తున్న మైహోమ్స్ అధినేత రామేశ్వర్‌రావు దంపతులు.

అతి సుందరం.. కళాత్మకం..

యాదాద్రిని ల్యాండ్ మార్క్‌లా తీర్చిదిద్దిన కేసీఆర్.. ముఖ్యమంత్రిపై చినజీయర్‌స్వామి ప్రశంసలు

యాదగిరిగుట్ట: 'యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ప్రధాన ఆలయం అతిసుందరంగా, కళాత్మకంగా నిర్మాణం జరిగింది.. శ్రీస్వామి వైభవానికి ఈ శతాబ్దిలో పెద్ద ల్యాండ్‌మార్క్ అనేలా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారు.. ఇందుకు ముఖ్యమంత్రికి అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను. ఆరంభించిన సంకల్పాన్ని అద్భుతమైన రీతిలో పూర్తి చేసుకున్నారు' అని శ్రీవైష్ణవ పీఠాధిపతి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామిజీ అన్నారు. యాదాద్రీశుడిని సోమవారం దర్శించుకున్న అనంతరం ఉత్తర మాఢ వీధిలో విలేకరులతో మాట్లాడారు. ప్రాచీన కళ యాదాద్రి ఆలయంలో ఉట్టిపడుతోందని, సీఎం కేసీఆర్ యాదాద్రి క్షేత్రాన్ని ప్రాచీన వైభవాన్ని తెలియజేయాలనే రీతిలో నిర్మాణం చేశారన్నారు. ఇంత మంచి కార్యాన్ని నెరవేర్చగలిగే అదృష్టం భగవంతుడు ముఖ్యమంత్రికి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. శ్రీనృసింహస్వామి తెలంగాణ రాష్ట్రానికి రక్షకుడిగా ఉన్నారని, దానికి తగ్గట్లుగా ఆలయ నిర్మాణం జరిగిందన్నారు.

బంగారు తాపడంకోసం 5 కిలోల బంగారం..

విమాన గోపురానికి బంగారు తాపడం కోసం శ్రీస్వామి వారికి డాక్టర్ రామేశ్వర్‌రావు గతంలో ఒక కిలో బంగారం సమర్పిస్తామని వాగ్దానం చేశారని స్వామీజీ తెలిపారు. ఈ కిలోకి మరొక నాలుగు కిలోలను చేర్చి మొత్తంగా 5 కిలోల బంగారాన్ని విమాన గోపురానికి తాపడం కోసం సమర్పించినట్లు జీయర్‌స్వామి చెప్పారు. పెరుమాళ్ల సన్నిధిలో ఆలయ అధికారులకు 5 కిలోల బంగారం డాక్టర్ రామేశ్వర్‌రావు అందజేశారన్నారు.

నిత్య కల్యాణ మండపానికి శంకు స్థాపన..

యాదాద్రి కొండపై గల బాలాలయం ఏర్పాటు చేసిన ప్రాంగణంలో చాలా కాలం శ్రీస్వామి వారు ఉన్నారని, ఆ ప్రాంగణంలో నిత్య కల్యాణం జరిపేందుకు మండపం నిర్మాణం చేసేందుకు పూజలు చేశామని జీయర్‌స్వామి తెలిపారు. త్వరలోనే డాక్టర్ రామేశ్వర్‌రావు ఈ నిర్మాణం పూర్తి చేసే బాధ్యతను స్వీకరిస్తారన్నారు. కాగా, ప్రధానాలయ ఉద్ఘాటన జరిగిన ఏడాదిన్నర తరువాత సోమవారం చినజీయర్ యాదాద్రికి వచ్చారు. ఆయన వెంట త్రిదండి దేవనాథ స్వామి, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావు ఉన్నారు.



నాగోబా ఆలయానికి పోటెత్తిన భక్తులు

నాగుల పంచమి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చొని నాగోబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

– ఇంద్రవెల్లి

జిల్లా వార్తలు


ఫ్యాక్టరీని సందర్శించిన మేనేజర్



విస్తరణ పనులను పరిశీలిస్తున్న మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు

దమ్మపేట: మండలంలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో జరుగుతున్న విస్తరణ పనులను ఆయిల్ ఫెడ్ మేనేజర్(ప్రాజెక్ట్స్) శ్రీకాంత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఫ్యాక్టరీ సామర్థ్యాన్ని 60 టన్నుల నుంచి 90 టన్నులకు పెంచే క్రమాన నూతనంగా బాయిలర్, వ్యర్థాలను వేరు చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను పరిశీలించాక మేనేజర్ నిర్మాణం పూర్తయిన రైతుల విశ్రాంతి భవనాన్ని కూడా పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ కళ్యాణ్, రాజేశ్, గోపాల్, విష్ణు పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు పరిహారం పెంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అభివృద్ధి పనుల్లో భాగంగా భూములు కోల్పోయిన వారికి పరిహారం పెంచాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం ఖమ్మంలో ధర్నా చేపట్టారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆయన ఆరోపించారు. తద్వారా వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతోందని హేమంతరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, గోవిందరావు, నాయకులు దండి సురేష్, జితేందర్‌రెడ్డి, జానీమియా, కళావతి, మహ్మద్ సలాం, రామ్మూర్తి, వెంకటేశ్వరావు, రవీందర్‌బాబు, రామాంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జన జీవనమే జానపదం

- శ్రమజీవుల మాటల కచేరీకి ప్రతిరూపం
- పాటకు సంగీతం తోడై కళగా రూపాంతరం
- ప్రస్తుత సమాజంలో కొరవడిన ప్రోత్సాహం

నేడు ప్రపంచ జానపద దినోత్సవం

ఖమ్మంగాంధీచౌక్: సామూహిక జీవన విధానమే జానపదం. గుంపులుగా ఏర్పడిన వారితో జనపదాలు రూపుదిద్దుకున్నాయి. ఆదిమవాసుల తరం నుంచి జన పదాలు ఉండగా.. కాలు కదపంగ ఆట వచ్చి చేరింది. ఆ జనపదాల ఆటపాటలే జానపదమయ్యాయి. వేర్వేరు ప్రాంతాల్లో విభిన్నమైన జానపదాలు కనిపిస్తాయి. ఇక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో జానపదానికి ప్రత్యేకత ఉంది. బతుకమ్మ ఆటపాటలలో, బోనాల పండుగ, సమ్మక్క, సారలమ్మ ఉత్సవాలు, దసరా పండుగ, సంక్రాంతి సందర్భాల్లో అలరించేవి జానపద ఆటపాటలే.

1846లో తొలిసారి

ఫోక్(జానపదం) అనే పదాన్ని ఇంగ్లాండ్‌కు చెందిన భాషా శాస్త్రవేత్త విలియం జాన్ థారస్ 1846 ఆగస్టు 22న ఉపయోగించారు. ఆయన స్ఫూర్తితో ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఏటా ఆగస్టు 22న జరుపుకుంటున్నారు. 18వ దశాబ్దంలో తెలుగు నాట జానపదల జీవనంపై అనేక అంశాలు వెలుగు చూశాయి. 19వ శతాబ్దంలో తెలుగు వారి విశిష్ట సాహిత్యం, కళారూపాలు తెరపైకి వచ్చాయి. జానపద జాతర పేరిట ఏటా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యాన ప్రభుత్వం జానపద ఉత్సవాలను నిర్వహిస్తోంది.

జానపదానిదే పైచేయి

ప్రతీ పనిలో శ్రమను మరిపించేది జానపదం. పాటతో పనిచేస్తే అలుపు సొలుపు ఉండదు. పనిలో అలసట కలగకుండా ఉండేందుకు కర్షక, కార్మికులు సామూహికంగా పాటలు పాడుతుంటారు. ఇక పండుగల్లోనూ ఆటపాటలతో కలిసి ఆనందాలను పంచుకోవటం ఆనవాయితీగా వస్తోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో జానపదాల సాంస్కృతిక కార్యక్రమాలు కీలక భూమిక పోషించాయి.

ఉమ్మడి జిల్లాలో 9 వేల మంది

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జానపదాలకు కొదవ లేదు. భిన్నమైన జాతులకు ఖమ్మం పెట్టింది పేరుగా నిలుస్తోంది. ఏజెన్సీ ప్రాంత కొండ జాతులతో పాటు ఆదివాసీలు, బంజారాలు, ఇతర జాతులు, సంచార జాతులు జీవనం సాగిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 9 వేల మంది జానపద కళాకారులు ఉన్నట్లు అంచనా. ఆదివాసీలు పురుషులు తలపాగలు, మహిళలు కొప్పున నెమలి పింఛం ధరించి



కొమ్ము బూర ఊదుతున్న ఆదివాసీ కళాకారుడు

కొమ్ము బూరలు, పెద్ద డోలుతో లయబద్ధంగా నృత్యాలు చేస్తూ ఆనందాలను పంచుతారు. బంజారాలు ఏకరూప దుస్తులు ధరించి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. తీజ్, దాటుడు వంటి పండుగల్లో భిన్నమైన నృత్యాలు చేస్తారు. బైండ్ల కులస్తులు జమ్మిడికలు, హార్మోనియం వంటి సంగీత పరికరాలతో తమదైన శైలిలో శివరాత్రి జాతరలు, అమ్మవార్ల వేడుకలు వంటి కార్యక్రమాల్లో జానపదాలను వినిపిస్తారు. అలాగే, ఒగ్గుకథలు, బుర్ర కథలు, డప్పు నృత్యాలు, కోలాటాల్లో జడకొప్పు, కోయ నృత్యం, చెక్క భజన, పిట్టల దొర, బుర్రకథ, కాటి కాపరుల, బుడిగ జంగాల జోస్యం, ఎరుకల కథ, సన్నాయి మేళం, ఒంటి చిర్ర కోలాటం వంటివెన్నో ఇక్కడ కనిపిస్తాయి.



కథ చెబుతున్న బైండ్ల జానపద కళాకారులు

కళారూపాలకు జీవం పోయాలి



జానపద కళారూపాలు మరుగున పడుతున్నాయి. ప్రభుత్వం కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలి. సాంస్కృతిక శాఖలోని సారథిలోనూ మాకు స్థానం కల్పించాలి. ప్రజాచైతన్యంలో జానపద కళాకారులను భాగస్వాములను చేస్తే మేలు జరుగుతుంది.

– పమ్మి రవి, పమ్మి, ముదిగొండ మండలం

కళ ఉంది కానీ ఆదరణ లేదు



జానపద కళ ఉన్నా ఆదరించే వారు కరువయ్యారు. కళలను ప్రజల్లోకి తీసుకెళ్లే వేదికలు లేకుండా పోయాయి. పండుగలు, వేడుకల్లోనే గుర్తిస్తున్నారు. కళలకు సంబంధించిన పరికరాలు అందుబాటులో లేకుండా పోయినందున ప్రభుత్వమే ప్రాధాన్యత ఇవ్వాలి.

– చిన్నపంగు రంజిత్‌కుమార్, పమ్మి, ముదిగొండ మండలం

పథకాల ప్రచారంతో ఉపాధి



ప్రభుత్వ పథకాల ప్రచారంలో జానపద కళాకారులను ఉపయోగించుకుంటే మాకు ఉపాధి లభిస్తుంది. ప్రజల్లోనూ పథకాలపై పూర్తి అవగాహన ఏర్పడుతుంది. నెలలో కనీసం పది రోజుల పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా చూడాలి.

– యంగల కుమారి, కలకోట, బోనకల్ మండలం

సాంకేతికత చేరింది..



జానపదంలోనూ సాంకేతికత వచ్చి చేరింది. పురాతన సంగీత పరికరాల స్థానంలో అధునాతనమైన పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. జానపదాలను మారుతున్న కాలానికి అన్వయిస్తూ కొత్తగా పాటలు రూపొందిస్తున్నారు. అయినా ఆనాటి జానపదాలను మరువలేం.

– గోవింద గురువయ్య, ఎర్రగడ్డ, తిరుమలాయపాలెం మండలం

అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపాలి

గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్ర సేథ్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో రాజ్యాంగ వ్యతిరేకంగా, అవినీతి పాలన సాగిస్తున్న ప్రభుత్వాన్ని సాగనంపాలని గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్ర సేథ్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వాన బలమైన శక్తిగా ఎదుగుతున్నామని, రానున్న ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరూ కృషిచేయాలని కోరారు. ప్రపంచ దేశాలకు దీటుగా భారత్‌ను మోదీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. కానీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మాత్రం కుటుంబపాలనగా ప్రఖ్యాతి చెందాయని ఎద్దేవా చేశారు. తెలంగాణలో దళితులకు మూడెకరాల భూమి, దళిత ముఖ్యమంత్రి, నిరుద్యోగ భృతి తదితర హామీలనే విస్మరించడమే కాక ఎన్నికల వేళ కొత్త పథకాలతో మోసానికి తెర తీశారని ఆరోపించారు. కాగా, ఈనెల 27న



మాట్లాడుతున్న గోవా ఎమ్మెల్యే ప్రేమేంద్రసేథ్

ఖమ్మంలో జరిగే సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరవుతున్నందున భారీగా తరలిరావాలని వారు కోరారు. ఈసమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉప్పల శారద, నాయకులు రుద్ర ప్రదీప్, మంద సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, ఆచంటి కోటేశ్వరావు, డీకొండ శ్యాం, బోయినపల్లి చంద్రశేఖర్, జ్వాలా నర్సింహారావు, గజ్జల శ్రీనివాస్, మధు, దాసు తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రేమేంద్ర సేథ్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు రుద్రగాని మాధవ్‌గౌడ్, ఉదయ్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

ఒక మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలో సోమవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్ స్టేషన్ పరిధి బట్టేవాడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు ప్లాటూన్ 16వ నంబర్‌కు చెందిన కమాండర్ మల్లేష్, ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యురాలు విమల, ఓర్చా ఎల్‌ఓఎస్ కమాండర్ దీపక్, ఓర్చా ఎల్‌జీఎస్ కమాండర్ రాంలాల్ తదితరులు సంచరిస్తున్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాల పైకి కాల్పులు జరుపుతూ పారిపోతుండగా పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగారు. హోరాహోరీగా సాగిన కాల్పుల్లో ఒక గుర్తు తెలియని మావోయిస్టు మృతి చెందగా, మిగిలిన వారు పారిపోయారు. ఘటనాస్థలం నుంచి ఒక 315 బోర్ రైఫిల్, 2 బోర్ రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తప్పించుకున్న మావోల కోసం కూంబింగ్ ముమ్మరం చేశారు.

బీజాపూర్ జిల్లాలో 40 మంది కిడ్నాప్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో ఆదివాసీలు నిర్వహిస్తున్న ఒక జాతరకు హాజరైన వారిలో 40 మందిని మావోయిస్టులు ఆదివారం సాయంత్రం కిడ్నాప్ చేశారు. కుట్రు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పర్సేఘడ్ సమీపంలో జరిగిన జాతరకు సమీప గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. వారిలో 40 మందిని మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. వారిలో పర్సేఘడ్‌కు చెందిన మాజీ సర్పంచ్ మహేష్ గుట్టంను అదుపులో ఉంచుకుని మిగిలిన 39 మందిని సోమవారం ఉదయం విడుదల చేశారు. మహేష్ పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నాడనే నెపంతోనే అదుపులో ఉంచుకున్నారని సమాచారం. కాగా, అతడికి ప్రాణహాని తలపెట్టకుండా క్షేమంగా విడిచిపెట్టాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

నైపుణ్యం పెంపునకు శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు పునశ్చరణ శిక్షణ తరగతులు ఉపయోగపడుతాయని సింగరేణి జీఎం(సెక్యూరిటీ) బీఆర్.దీక్షితులు తెలిపారు. కొత్తగూడెంలోని ఎస్ అండ్ పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో సెక్యూరిటీ సిబ్బందికి 73వ బ్యాచ్ శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగులు నిరంతరం నేర్చుకుంటుండడం ద్వారా వృత్తిలో మెళకువలు పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న అంశాల ఆధారంగా వృత్తిలో ప్రతిభ కనబర్చాలని సూచించారు. అధికారులు వేణుమాధవ్, జాకీర్ హుస్సేన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఛత్తీస్‌గఢ్ మంత్రి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఛత్తీస్‌గఢ్ మంత్రి కావసి లఖ్మ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అలాగే, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేయగా, పండితులు ఆలయ విశిష్టతను వివరించి వేదాశీర్వచనం అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సరెళ్ల నరేష్, బలుసు నాగ సతీష్, వెంకటేష్, రాగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.